క్లుప్తంగా

శంకరంలో మెగా ప్లాంటేషన్ మేళా



మేళాను ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేష్, ఎంహెచ్‌వో భాను పుష్పలీలావతి

మాడుగుల రూరల్: శంకరంలో మెగా ప్లాంటేషన్ మేళాను సర్పంచ్ శోలం రమేష్, మండల ఉద్యానవన శాఖాధికారి వి.భాను పుష్పలీలావతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి సెప్టెంబరు 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉద్యానవనశాఖ అందిస్తున్న పథకాలను వివరించారు. ఆయిల్‌పామ్ సాగుకు అందిస్తున్న రాయితీలను వివరించి, అంతర పంటలుగా కూరగాయలు, కోకో వేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని సూచించారు. ఆసక్తి కలిగిన రైతులు తమ సమీపంలో రైతు సేవా కేంద్రాల్లో వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వీఏఏలు, వీహెచ్ఏలు, ఆయిల్ పామ్ మేనేజర్ పి. శ్రీనివాస్, ఫీల్డ్ అధికారి విజయదుర్గ, రైతులు పాల్గొన్నారు.

31 వరకు లంపీస్కిన్ నివారణ టీకాలు



జి.కొత్తపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

చీడికాడ: మండలంలో ఈ నెల 31వ తేదీ వరకు పశువులకు ముద్ద చర్మవాధి(లంపీ స్కిన్) నిరోధక టీకాలు వేస్తున్నట్టు పశువైద్యాధికారి కె.రాఘవమ్మ తెలిపారు. మంగళవారం ఆమె జి.కొత్తపల్లి, అర్జునగిరి, తురువోలు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు పరిశీలించారు. పశువులకు ముద్దచర్మ వ్యాధి, జీవాల్లో వచ్చే నీలినాలుక వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ నెలాఖరు వరకు అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థి నాయకులతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ

నర్సీపట్నం: విద్యార్థులు చదువుతోపాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వీ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్న యజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. అనంతరం విద్యా సంస్థల చైర్మన్ ఎంఎస్ మణి మాట్లాడుతూ కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు సూచనలను పరిగణనలోకి తీసుకుని విద్యలో రాణించాలన్నారు. నూతనంగా నాయకులుగా ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలు ధరింపజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేవీఎస్ గిరి, ఏజీఎం జీవీఎస్ఎన్‌మూర్తి, డివిజనల్ ఇన్‌చార్జి గోవింద్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి అవతారంలో జగన్నాథస్వామి



భక్తులకు దర్శన మిచ్చిన జగన్నాథస్వామి

చోడవరం: జగన్నాథస్వామి దశావతారాల్లో భాగంగా కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి అవతారంలో స్వామివారు మంగళవారం భక్తులకు దర్శన మిచ్చారు. పట్టణంలోని బోళ్లవీధి రామాలయంలో బలభద్రుడు, సుభద్ర సమేతుడైన జగన్నాథస్వామికి రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పదో రోజున స్వామివారు వేంకటేశ్వరస్వామి అవతారంలో దర్శన మిచ్చారు. అర్చకులు భక్తులకు దర్శనం కల్పించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 7997958337, 7075709854,
7997958336
సాక్షి

ఊరొకచోట... స్కూల్ మరో చోట



బి.ఎస్.పేట పాఠశాల భవనం

బడి ఈడు పిల్లలకు ప్రాథమిక విద్య దూరం కారాదు. అందుకే సాధ్యమైనంత వరకు ప్రతి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉంటుంది. గ్రామాల్లో తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లినా.. ఊర్లోనే ఉన్న బడికి పిల్లలు వెళ్లి, వచ్చేస్తారని భరోసా. మాకవరపాలెం మండలంలోని బీఎస్ పేట పిల్లల పరిస్థితి ఇందుకు విరుద్ధం. వీరు స్కూల్‌కి వెళ్లాలంటే ఊరు దాటి కిలోమీటరు పైనే నడవాలి. మధ్యలో మృత్యుకుహరాల్లాంటి నేలబావులు. దీంతో పిల్లలు స్కూల్‌కు వెళ్లి, ఇంటికి తిరిగి వచ్చేంత వరకూ తల్లిదండ్రుల్లో భయం. 13 ఏళ్లుగా ఇక్కడి విద్యార్థుల పరిస్థితి ఇదే..!

- దారిలో ప్రమాదకరంగా నేల బావులు
- వాటి పక్కనుంచే రోజూ పిల్లల రాకపోకలు
- 13 ఏళ్లుగా బీఎస్ పేట విద్యార్థుల ఇక్కట్లు



ప్రమాదకర బావి పక్కనుంచి పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: మండలంలోని పీపీ అగ్రహారం పంచాయతీ శివారులో బీఎస్ పేట ఉంది. ఈ గ్రామం ప్రధాన రహదారికి కిలోమీటరు దూరంలో ఉండేది. అక్కడి వారంతా 13 ఏళ్ల క్రితం రహదారికి దగ్గరగా ఉన్న స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారు. 200కు పైగా ఉన్న ఇళ్లలో 700 మంది వరకు నివాసం ఉంటున్నారు. గ్రామం రోడ్డుకు చేరువైనా.. పాత గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల మాత్రం తరలి రాలేదు. దీంతో గతంలో 90 మంది వరకు ఉండే విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 21కి దిగజారింది. అయినా విద్యాశాఖలో చలనం లేదని స్థానికులు వాపోతున్నారు.

నేల బావులతో భయం భయం

గతంలో ఊరికి చేరువగా ఉన్న ప్రాథమిక పాఠశాలకు ఇప్పుడు ఊరు దూరమయింది. దీంతో రోజూ విద్యార్థులు కిలోమీటరుకు పైగా నడిచి వెళ్లాలి. తిరిగి రావడానికి మరో కిలో మీటర్ నడవాలి. వెళ్లే దారిలో రోడ్డుకు ఆనుకుని మూడు వ్యవసాయ నేల బావులున్నాయి. వీటిలో రెండు బావులు పాఠశాలకు అతి చేరువలోనే ఉన్నాయి. నిత్యం వీటి పక్క నుంచే విద్యార్థులు పాఠశాలకు వెళ్తుండటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలంతా పదేళ్ల లోపు వయసున్నవారే కావడంతో వారు క్షేమంగా ఇంటికి చేరుకునేంత వరకు తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సిందే. కొత్తగా స్కూల్ భవనాన్ని తమ గ్రామానికి దగ్గరగా నిర్మించాలని ఎంత మందికి మొరపెట్టుకున్నా ఫలితం కనిపించట్లేదని స్థానికులు వాపోతున్నారు.

వెనక్కి మళ్లిన నిధులు

కొత్త గ్రామంలో పాఠశాల నిర్మాణానికి గతంలో నిధులు మంజూరయ్యాయి. అయితే నిర్మాణానికి అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో నిధులు వెనక్కి మళ్లాయి. ఆ తర్వాతి నుంచి ఈ సమస్యపై పట్టించుకునేవారే లేరు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పట్లేదు. మరోవైపు ప్రస్తుతం ఉన్న భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ తరగతుల నిర్వహణకు సిబ్బంది దినదిన గండంగా గడుపుతున్నారు. శిథిలావస్థకు చేరుకున్న స్కూల్ శ్లాబ్ పెచ్చులు ఊడి, ఎవరు గాయపడతారోనని భయపడుతున్నారు. వర్షాకాలంలో ఈ ఇబ్బందులు మరీ ఎక్కువ. మట్టి రోడ్లపై వచ్చేందుకు పిల్లలు కష్టపడాలి. గోడలు, శ్లాబ్ నీటికి తడిసి ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయపడే పరిస్థితి. ప్రైవేట్ స్కూళ్లలో చదివించుకునే స్థోమతలేని తమకు, పిల్లల చదువు కోసం ఇన్ని తిప్పలు పడాల్సిన పనిలేకుండా స్కూల్‌ను గ్రామానికి దగ్గరగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్థలం ఇస్తే నిధులకు ప్రతిపాదనలు



కొత్త గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి స్థలం లేదు. స్థానికులు ముందుకొచ్చి స్థలం ఇచ్చేందుకు సహకరిస్తే ఉన్నతాధికారులకు నివేదించి, నిధులు మంజూరుకు కృషి చేస్తా. గ్రామ పెద్దలు/పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆ దిశగా దృష్టి సారించి స్థలం కేటాయింపునకు ముందుకురావాలి. స్థలం సిద్ధంగా ఉంటే వెంటనే భవన నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తా.

– పీఎస్ఎస్ మూర్తి, ఎంఈవో–2, మాకవరపాలెం

చిరుధాన్యాల సాగుపై రైతుల దృష్టి

కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్

దేవరాపల్లి: చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త ఎస్. రాజ్‌కుమార్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పెదనందిపల్లిలో చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ప్రస్తుతం ప్రజలంతా చిరుధాన్యాల వైపు మొగ్గు చూపడంతో మార్కెట్లో మంచి డిమాండ్ నెలకొందన్నారు. రాగులు, కొర్రలు, అండు కొర్రలు, తెల్ల జొన్న, పచ్చ జొన్నలు తదితర చిరుధాన్యాల విత్తనాలను రైతులకు అందజేశారు. వాటి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. అనంతరం శాస్త్రవేత్త సౌజన్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తమవంతుగా తోడ్పాటు నందిస్తామన్నారు. కాయగూరల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను మరో శాస్త్రవేత్త సత్తిబాబు సమగ్రంగా అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

మరిడిమాంబ పండగ రేపు

- అంగరంగ వైభవంగా ఘటాల ఊరేగింపు



మరిడిమాంబ ప్రతి రూపమైన ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మాడుగుల: పట్టణంలోని ఐండివరం రోడ్డులో మంగళవారం మరిడిమాంబ అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు ఊరేగించి పాదాల వద్ద కొలువు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి ఘటాల ఉత్సవంలో పాల్గొన్నారు.ఈ నెల 18వ తేదీ వరకు అమ్మవారు అక్కడే భక్తులకు దర్శనమిస్తారు. అదే రోజు సంబరం ద్వారా అమ్మవారు ఆలయానికి చేరుకోవడంతో పండగ ముగుస్తుందని ఉత్సవ కమిటీ తెలిపింది. మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ మెంబరు దేవరాపల్లి శ్రీను పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

మాడుగుల: ప్రతి రైతు నీటి, ఎరువులు యాజమాన్య పద్ధతులుపై అవగాహన పెంచుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. మండలంలో పోతనపూడి, గొటివాడ అగ్రహారం గ్రామాల్లో మంగళవారం ఆయన వరి నారుమడులు పరిశీలించారు. ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వరి నారుమడులులో నీటి నిల్వలు అధికంగా ఉండకుండా జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. నారుపోసిన పది రోజుల వ్యవధిలో ప్రతి ఐదు సెంట్లు నారు మడికి రెండు కిలోలు యూరియా, రెండు కిలోలు డీఏపీ, రెండు కిలోలు పోటాష్ ఎరువులు తప్పనిసరిగా వాడాలన్నారు. దీనివల్ల నారుకు ఎటువంటి తెగుళ్లు ఆశించవన్నారు.




పోతనపూడిలో రైతులకు వివరిస్తున్న ఏవో వాసుదేవరావు తదితరులు

శిరిజాం చానల్ నీటి సంఘం చైర్మన్‌గా జోగినాయుడు



మాడుగుల రూరల్: శిరిజాం చానల్ నీటి సంఘం పరిధి లో పలు సాగునీటి కాలువలకు నామినేటెడ్ డైరెక్టర్లను రైతులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాళ్లపల్లి డైరెక్టరుగా రాపేట జోగినాయుడు, మీద హూండీ కాలువ డైరెక్టరుగా బొడ్డేడ వెంకట్రావు, కింద హూండీ కాలువ డైరెక్టరుగా పెంటకోట పెదకన్నారావు, మావూళ్లు కాలువ డైరెక్టరుగా వేగి జగ్గారావు, మీద హూండీ కాలువ డైరెక్టరుగా బుద్దా పైడినాయుడు, సేరి కాలువ డైరెక్టరుగా ఆడారి అప్పలనాయుడు, వంటర్లపాలెం కాలువ డైరెక్టరుగా సకలా శేషగిరిని ఎన్నుకున్నారు. వీరిలో రాళ్లపల్లి కాలువ డైరెక్టరు జోగినాయుడును శిరిజాం చానల్ నీటి సంఘం అధ్యక్షుడిగా డైరెక్టర్లు ఎన్నుకున్నారు.

గైరమ్మ సత్యం మృతికి సంతాపం



రోలుగుంట: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రోలుగుంట పంచాయతీ నాల్గో వార్డు మెంబరు మద్దు గైరమ్మ సత్యం మృతికి పలువురు సంతాపం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న అతను సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇతని మరణం పట్ల జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శెట్టి సత్యనారాయణమూర్తి, పోతల లక్ష్మీ శ్రీనివాస్, మలసాల భాస్కరరావు, టి.వి.రమణ, గొర్లె చెల్లం నాయుడు, రోలుగుంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకట్రావు, మద్దు తాతబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మద్దు ఎర్రయ్యమ్మ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎంతో ఘనంగా నిర్వహించే ఇక్కడ గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని వర్గ విభేధాల వల్ల రెండు దశాబ్దాల క్రితం వదిలేశారు. ఆ సమయంలో గైరమ్మ సత్యం ముందుకొచ్చి 11 సంవత్సరాలుగా నిర్వహించాడు. ఆ తర్వాత ఒప్పందం మేరకు ఒక ఏడాది సుర్ల వర్గం, మరో ఏడాది మునసబ్ వర్గం నిర్వహిస్తున్నారు. గైరమ్మ సత్యం మనసబ్ వర్గంతో కలసి ఉత్సవ నిర్వహణలో భాగస్వాములయ్యాడు. అందుకే ఇతని ఇంటి పేరు మద్దు కాగా, అందరూ గైరమ్మ సత్యం అని పిలవడం పరిపాటిగా మారింది. అంతేకాకుండా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేశారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో కొనసాగుతూ గత పంచాయతీ ఎన్నికల్లో నాల్గో వార్డు మెంబర్‌గా గెలిచారు.

వడ్డాదిలో ఘనంగా పోలమాంబ పండగ



సంబరంలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో గ్రామ దేవత పోలమాంబ పండగను మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి డప్పులు, వాయిద్యాలుతో అమ్మవారి ఘటాలు, నేలవేషాలతో రెల్లివీధి నుంచి సంతబయలు వరకు సంబరం సాగింది. వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో మోదకొండమ్మ అమ్మవారి పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.

కర్రలే విద్యుత్ స్తంభాలు



దేవరాపల్లి: గరిశింగి పంచాయతీ శివారు చింతలపాలెంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. యాలంబైలు గ్రామం నుంచి చింతలపాలెం వరకు విద్యుత్ స్తంభాలు లేవు. దాంతో చెట్లపైన విద్యుత్ తీగలను లాగి కర్రలు ఊతంగా పెట్టి కరెంటు సరఫరా చేస్తున్నారు. అయితే చిన్నపాటి గాలి వీచినా వర్షం కురిసినా చెట్ల కొమ్మలు విరిగి పడటంతో తీగలు తెగిపడి సరఫరాకు తరుచూ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో చింతలపాలెం గ్రామస్తులంతా కటిక చీకటిలో గడపాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దీనిపై ఆ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తక్షణమే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బీటీ దొర డిమాండ్ చేశారు. తక్షణమే పరిష్కరించకుంటే స్థానిక గిరిజనులతో కలిసిన సబ్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

బ్యాంకు లింకేజీ రుణాలతో ఆర్థికాభివృద్ధి

- ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ రాజేశ్వరి

కె.కోటపాడు: డ్వాక్రా సంఘాలకు అందించే బ్యాంకు లింకేజీ రుణాలతో ప్రతీ సభ్యురాలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని పెందుర్తి ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాలను తీసుకోవడంతోపాటు వాటిని ప్రతి నెలా బ్యాంక్‌కు సకాలంలో వాయిదా పద్ధతిలో చెల్లించాలని సూచించారు. ప్రతి నెలా గ్రామ సంఘాల సమావేశం నిర్వహించడంతోపాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. స్త్రీనిధి మేనేజర్ జగదీశ్వరి, ఏపీఎం పి.వెంకటలక్ష్మి, సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సన్యాసిరావు, సీతంనాయుడు, సింహాచలంనాయుడు, సురేష్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా

4 గ్రామాల్లో అధికారుల పరిశీలన



అప్పన్నదొరపాలెంలో ఇసుక తవ్వకం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



తూటిపాలలో నిల్వ ఇసుక పరిశీలిస్తున్న అధికారులు

మాకవరపాలెం: ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తహసీల్దార్ మురళీమోహన్‌రావు తెలిపారు. మండలంలోని తూటిపాల, అప్పన్నదొరపాలెం, కొండలఅగ్రహారం, మాకవరపాలెం ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను పోలీస్, పంచాయతీ రాజ్, మైన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలోని నదులు, గెడ్డలు, జిరాయితీ భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. తూటిపాలలో ఇసుక నిల్వలను పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు పెడతామన్నారు. ఇసుక అక్రమ తరలింపు, తవ్వకాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇదే విషయమై పోలీసులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు నిఘా ఉంచాలని ఆదేశాలిచ్చామన్నారు. ఎస్ఐ రామకృష్ణారావు, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలు కుష్టువ్యాధికి సంకేతాలు



మాట్లాడుతున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: శరీరంపై స్పర్శలేని మచ్చలను కుష్టువ్యాధికి సంకేతాలుగా గుర్తించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. దీనిపై ప్రజలకు వైద్య సిబ్బంది వివరించాలన్నారు. కుష్టువ్యాధిగ్రస్తులను గ్రామాల్లో గుర్తించే కార్యక్రమంపై వైద్య సిబ్బందితోపాటు ఆశా కార్యకర్తలకు ఆస్పత్రిలో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ శరీరంపై రాగి రంగు మచ్చలు ఉంటే, వైద్య సిబ్బందికి సమాచారాన్ని ఇవ్వాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ప్రారంభ దశలోనే కుష్టువ్యాధికి మెరుగైన వైద్యం అందితే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. గ్రామాల్లో ఇటువంటి లక్షణాలు గల వారిని గుర్తించే కార్యక్రమాన్ని ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ చేపట్టాలన్నారు. పీహెచ్ఎన్ ప్రమీల, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: విద్యార్థుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే, ఆ ప్రభావం చదువుపై పడుతుందని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. స్థానిక హాస్టల్‌లో విద్యార్థులకు మంగళవారం ఆమె వైద్య పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న వారికి మందులు పంపిణీ చేసి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మార్పు కారణంగా జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులకు విధిగా రక్త పరీక్షలు చేస్తున్నామన్నారు. తర్వాత సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా సూచనలు చేశామన్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కాచి చల్లార్చిన నీళ్లు తాగాలన్నారు. నిల్వ ఉన్న ఆహారం తినరాదన్నారు. ప్రధానంగా కొంతకాలంపాటు చేపలు, మాంసం పూర్తిగా తగ్గించి ఆకుకూరలు, పప్పులు దినుసులు తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఉపశమనం



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈవో వరహాలబాబు

నాతవరం: దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేయడం వల్ల కొంత వరకు ఉపశమనం కలుగుతుందని ఎంఈవో–2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. దీనిపై వారి తల్లిదండ్రులు కనీస అవగాహన చేసుకుంటే ఇంటి వద్ద తర్ఫీదు ఇవ్వొచ్చన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం అనేక సదుపాయా లు కల్పిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు చేస్తున్న విధంగా ఇంటి వద్ద తల్లిదండ్రులు తర్ఫీదు ఇస్తే త్వరగా సాంత్వన పొందుతారన్నారు. వారు పనులు వారు చేసుకుంటారని సూచించారు. భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఏవిధమైన సేవలు అందించారనే విషయాలపై వివరించారు. కార్యక్రమంలో సహిత కేంద్రం ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాది హెచ్‌ఎంకు మెమో జారీ

హైస్కూల్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈవో



ఎండీఎం సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలం వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌ను డిప్యూటీ డీఈవో పి. అప్పారావు తనిఖీ చేశారు. ఇటీవల ఇక్కడ ఆరుగురు పదో తరగతి విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం ఆయన పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన తయారీ వంటల షెడ్డును పరిశీలించి భోజనం రుచి చూశారు. పరిశుభ్రమైన ప్రదేశంలో నాణ్యమైన కూరగాయలతో శుచి శుభ్రతతో వండిపెట్టాలని నిర్వాహకులకు సూచించారు. తరగతి గదికెళ్లి బోధనలో సమస్యలున్నాయా అని విద్యార్థులను ఆరాతీశారు. మంచినీటితోపాటు బాత్‌రూంలు, డోర్లు పరిశీలించారు. బాత్ రూం డోర్లు సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్ ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటరావును ఆదేశించారు.

హెచ్‌ఎంకు తాఖీదు...

సరైన మరుగుదొడ్ల సౌకర్యం కల్పించకుండా నిర్లక్ష్యంగా ఉండటంపైన, జిల్లా అధికారుల సందర్శన సమయంలో సమాచారం ఇవ్వకుండా సెలవు పెట్టి వెళ్లిన హెచ్‌ఎం శేషుబాబుకు డీఈవో వెంకటలక్ష్మమ్మ మెమో జారీ చేసినట్లు ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు.

19న ఐటీఐలో ఉద్యోగ మేళా

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈ నెల 19 వతేదీ ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. హైదరాబాద్, చైన్నై, విశాఖపట్నం, పరవాడ, శ్రీసిటీలోని కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com